## క్లుప్తంగా

### సిద్ధం సభకు భారీగా తరలిన నాయకులు



కోనపాపపేట నుంచి వెళుతున్న అభిమానులు

కొత్తపల్లి: పిఠాపురంలో నిర్వహించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల సిద్ధం సభకు మండలం నుంచి శనివారం భారీగా తరలి వెళ్లారు. ఎంపీపీ కారే సుధ ఆధ్వర్యంలో కోనపాపపేట నుంచి మండల పార్టీ అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, వైస్ ఎంపీపీ మాదిరెడ్డి దొరబాబు, రాష్ట్ర కార్యదర్శి రావు చిన్నారావు, వడిశెట్టి నారాయణరెడ్డి ఆధ్వర్యంలో భారీగా తరలివెళ్లారు.

### పోలింగ్ కేంద్రాల్లో వసతుల ఏర్పాటు



అమరవిల్లిలో పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ వెంకటనారాయణ

కొత్తపల్లి: పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు ఏర్పాటు చేశామని ఎంపీడీఓ వెంకటనారాయణ అన్నారు. మండలంలోని అమరవిల్లి, కొత్తమూలపేట, మూలపేట, పొన్నాడలో ఉన్న పోలింగ్ బూతులను శనివారం ఆయన పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్, ఫ్యాన్లు, బాత్‌రూములు, ర్యాంపులను ఆయన పరిశీలించారు. సోమవారం జరగనున్న ఎన్నికలకు సంబంధించి ఓటర్లకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా తాగునీరు అందుబాటులో ఉంచాలన్నారు.

### 1,640 మంది పోలింగ్ సిబ్బందికి ర్యాండమైజేషన్



మూడో దశ ర్యాండమైజేషన్ ప్రక్రియను నిర్వహిస్తున్న కలెక్టర్ నివాస్

కాకినాడ సిటీ: సాధారణ ఎన్నికలు–2024 నిర్వహణలో భాగంగా పోలింగ్ కేంద్రాల మూడో దశ ర్యాండమైజేషన్ ప్రక్రియను శనివారం కలెక్టరేట్ ఎన్ఐసీ సెంటర్‌లో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జె.నివాస్, జిల్లా పరిశీలకులు ఎస్.గణేష్, రాజేష్ జోగ్‌పాల్ సమక్షంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నివాస్ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం రాష్ట్ర ఎన్నికల కమిషన్ సూచనలకు అనుగుణంగా కాకినాడ పార్లమెంట్, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి మూడో దశ ర్యాండమైజేషన్ ప్రక్రియ ద్వారా ఈనెల 13న జరిగే ఓటింగ్ ప్రక్రియలో పాల్గొనే పోలింగ్ సిబ్బందికి మొత్తం 1,640 పోలింగ్ కేంద్రాలకు కేటాయించామన్నారు. పీవో, ఏపీవో, ఓపీవో, మైక్రో అబ్జర్వర్లు ఇతర సిబ్బందికి 12న ఆయా నియోజకవర్గాల డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో అబ్జర్వర్లు ఇతర సిబ్బందికి 12న ఆయా నియోజకవర్గాల డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో పోలింగ్ సామగ్రితో పాటు ఏ పోలింగ్ కేంద్రంలో విధులు నిర్వర్తించాలో తెలియజేయడం జరుగుతుందన్నారు. పోలింగ్ సిబ్బంది అంతా ఆదివారం నిర్ణయించిన సమయానికి ఆయా డిస్ట్రిబ్యూషన్ సెంటర్లకు చేరుకోవాలన్నారు. ఎవరైనా ఎన్నికల విధులకు గైర్హాజరైనట్టయితే వారిపై ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నివాస్ స్పష్టం చేశారు. కాకినాడ జిల్లాలో నిష్పక్షపాతంగా పారదర్శకంగా పోలింగ్ ప్రక్రియ జరిగేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. జిల్లాలో ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ 13వ తేదీన తప్పనిసరిగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ కోరారు. కార్యక్రమంలో సీపీవో త్రినాథ్, ఎన్ఐసీ ఐటీ డైరెక్టర్ సీహెచ్ సుబ్బారావు, ఇతర ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

### జై ఓటరన్నా





తాను గీసిన చిత్రంతో చిరంజీవిరావు

కరప: దేశ భవిష్యత్‌ను కాపాడేది ఓటు హక్కే అంటూ కరప మండలం కూరాడ జెడ్పీ ఉన్నత పాఠశాల డ్రాయింగ్ టీచర్ పెట్టా చిరంజీవిరావు వేసిన చిత్ర లేఖనం ఓటర్లను చైతన్యపరుస్తోంది. దేశం కోసం పాటుపడే సైనికుడిని జై జవాన్ అని, అన్న దాతను జై కిసాన్ అని అంటారు. దేశ భవిష్యత్‌ను మార్చే ఏకైక ఆయుధం ఓటు, అటువంటి పవిత్రమైన ఓటును మద్యానికి, డబ్బుకి, పలావు ప్యాకెట్‌కు అమ్ముడుపోయి, దేశాన్ని నాశనం చేసే నాయకులను, రౌడీలను ఎన్నుకోరాదని, ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా మంచి నాయకుడిని ఎన్నుకునేందుకు ఓటు అనే ఆయుధాన్ని ఉపయోగించి 'జై ఓటరన్నా' అనిపించుకుందాం అనే సందేశంతో గీసిన ఆయన చిత్రం అందరినీ ఆలోచింపజేస్తోంది.



సభకు పోటెత్తిన జనం



సభలో ప్రసంగిస్తున్న సీఎం జగన్

# వెల్లువెత్తిన అభిమానం

- పిఠాపురంలో సీఎం జగన్‌కు ఘన స్వాగతం
- దారి పొడవునా అభిమాన నేతకు జన నీరాజనం



అన్నను చూసిన ఆనందం



జగనన్నను ఫొటో తీసేందుకు పోటాపోటీ



టీడీపీ 2014లో ఇచ్చిన మేనిఫెస్టో చూపుతూ ఏ ఒక్క హామీని అమలు చేయలేదని చెబుతున్న సీఎం జగన్. చిత్రంలో ఎమ్మెల్యే పెండెం దొరబాబు

పిఠాపురం, కొత్తపల్లి: తమ అభిమాన నేత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కళ్లారా చూసేందుకు తరలి వచ్చిన జన సమూహంతో శనివారం పిఠాపురం నిండిపోయింది. సాయంత్రం వస్తారని తెలిసినా మండుటెండలో మిట్ట మధ్యాహ్నమే పిఠాపురం జన సమూహం చేరుకుంది. తన మనవడిని చూడాలని ఊత కర్రతో ఉత్సాహంగా వచ్చిన తాత, ఓపిక లేకున్నా, శరీరం సహకరించకపోయినా తన మనవడిని మనసారా చూడాలన్న తపనతో అడుగులేసుకుంటూ వచ్చిన అవ్వ, ఎండలో చంటి బిడ్డను చంకన ఎత్తుకుని వడివడిగా నడుస్తూ వస్తున్న ఓ తల్లి, నీవే మాభవిష్యత్తు, నీవెంటే మేమంతా అంటూ ఉరకలేసిన యువత, అన్నొచ్చాడంటూ డీజేలతో స్టెప్పులేస్తూ ఆనందంతో ఆకాశమంత అభిమానాన్ని చాటుకుంటున్న అక్కా చెల్లెమ్మలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిఠాపురంలో ఎన్నికల ప్రచార సభలో ప్రసంగించేందుకు వచ్చిన సందర్భంగా కనిపించిన దృశ్యాలివి. సీఎం వైఎస్ జగన్ ఎన్నికల సభ పిఠాపురం నియోజకవర్గ వాసుల ఆదరాభిమానాల మధ్య జైత్రయాత్రను తలపించింది. భగభగ మండే భానుడిని సైతం లెక్క చేయకుండా అశేష జన వాహిని పిఠాపురంలో జగన్‌కు బ్రహ్మరథం పట్టింది. పిఠాపురం ఆర్ఆర్‌బీహెచ్ఆర్ కాలేజీ గ్రౌండ్‌కు హెలికాప్టర్‌లో చేరుకున్న సీఎం వైఎస్ జగన్ అక్కడి నుంచి బస్సులో ఉప్పాడ సెంటర్ వరకు ర్యాలీగా వచ్చారు. మధ్యాహ్నం నుంచి ఎదురుచూస్తున్న అభిమానులు, పార్టీ శ్రేణులు అపూర్వ స్వాగతం పలికారు. షెడ్యూల్ కంటే ముందుగానే సభాస్థలికి చేరుకున్న జనం ఆయన వచ్చే వరకు అలా వేచి చూస్తూనే ఉన్నారు. పిఠాపురంలో మేళతాళాలతో యువకులు కదం తొక్కగా జనం నృత్యాలు చేస్తూ తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. రోడ్డు షో పొడవునా ఆత్మీయ పలకరింపులు అభివాదాలతో అశేష జనవాహినిని దాటుకుంటూ సభా స్థలికి చేరుకున్నారు. పిఠాపురం నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత అభిమానులు, అనుచరులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున ఆయనకు ఘన స్వాగతం పలికారు. గీత వెంటే తామంతా ఉంటామంటూ, జైగీతమ్మ అంటూ జేజేలు పలికారు. పూలదండలతో పూలజల్లులతో కొందరు, గుమ్మడి కాయలతో దిష్టి తీయడానికి కొందరు దారి పొడవునా గంటల తరబడి ఎదురుచూస్తూ ఆయన కనిపించగానే కేరింతలు కొట్టారు. మరోసారి ముఖ్యమంత్రిగా మీరే రావాలంలూ నినాదాలతో రోడ్డు పొడవునా హోరెత్తించారు.



హాయ్ జగన్... జై జగన్



జగనన్న తమ వైపు చూడడంతో ఉత్సాహంగా చేతులు ఊపుతున్న అభిమానులు



అభిమానం కేరింత

# సార్వత్రిక ఎన్నికలకు సర్వం సిద్ధం

- నియోజకవర్గంలో 201 పోలింగ్ కేంద్రాలు
- 46 సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తింపు



పెద్దాపురంలోని ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయం

సామర్లకోట: సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకుని ఎన్నికల కమిషన్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాట్లు చేశారు. ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాట్లు చేశారు. పోలింగ్ కేంద్రాల్లోకి కేవలం ఓటరు స్లిప్ ఉన్న వారిని మాత్రమే అనుమతించేలా ఆదేశాలు జారీ చేశారు. ఎన్నికల రోజున ఉదయం నుంచి సాయంత్రం వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందని అధికారులు ప్రకటించారు. ఎక్సైజ్ అధికారులు శనివారం సాయంత్రం మద్యం దుకాణాలకు సీల్ వేశారు. గుంపులు, గుంపులుగా తిరిగే వారిపై చర్యలు ఉంటాయని హెచ్చరికలు జారీ చేశారు. ఎన్నికలు ప్రశాంతంగా ఎటువంటి ఇబ్బంది లేకుండా ఉండేలా సిబ్బందిని నియమించారు. ఈ మేరకు నియోజకవర్గ పరిధిలో 22 సెక్టోరల్ అధికారుల బృందాలను ఏర్పాటు చేశారు. వీరిలో ఒక అధికారితో పాటు పోలీసు అధికారి ఉంటారు. ఈ బృందం సభ్యులు ఆయా పోలింగ్ కేంద్రాలల్లో మౌలిక సదుపాయాలను పరిశీలించడంతో పాటు పోలింగ్ రోజున ఈవీఎంలు మొరాయిస్తే వాటిని మార్పు చేసే పనిలో ఉంటారు. సెక్టోరల్ అధికారులు 8 నుంచి 12 పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసే విధంగా ఏర్పాటు చేశారు.

**201 మంది పోలింగ్ అధికారులు..**

పెద్దాపురం నియోజకవర్గ పరిధిలో 201 పోలింగ్ కేంద్రాలు ఉండగా వాటి పరిధిలో 201 పీఓలు 201 మందిని ఏపీఓలుగాను, 201 మంది పీపీఓలుగా 603 మంది అధికారులను నియమించారు. మరో 603 మందిని రిజర్వులో నియమించారు. సోమవారం ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పోలింగ్ జరుగుతుంది.

**నియోజకవర్గంలో 46 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు..**

నియోజకవర్గ పరిధిలో 46 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుగా పోలీసు, రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో గుర్తించినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి జె.సీతారామారావు తెలిపారు. పెద్దాపురం మండల పరిధిలో కాండ్రకోటలో 6, 7, కట్టమూరులో 10, 11, 12, గుడివాడలో 18, ఉలిమేశ్వరంలో 20, 21, మర్లావలో 24, 25, తిరుపతిలో 26, 27, తాటిపర్తిలో 28, 29, దివిలిలో 32, 33, 34, పులిమేరులో 35, 36, చిన్న బ్రహ్మదేవంలో 88, 89 పోలింగ్ కేంద్రాలను సమస్మాత్మక కేంద్రాలుగా గుర్తించారు. అదే విధంగా సామర్లకోట మండల పరిధిలో పీబీ దేవంలో 95,97 జి.మేడపాడులో 102, 103, వేట్లపాలెంలో 113, 114, 116, 117, హుస్సేన్‌పురంలో 162, వీకే రాయపురంలో 169, 170, 173 మాధవపట్నంలో 176, 177, 180, పి. వేమవరంలో 191, 192 సామర్లకోట పట్టణంలో 125, 127, 128, 129,138, 139, 141, 149 పోలింగ్ కేంద్రాలను సమస్మాత్మక కేంద్రాలుగా గుర్తించి వాటిపై ప్రత్యేక నిఘా ఉంచారు. ప్రతి పోలింగ్ స్టేషన్ వద్ద ఇద్దరు పోలీసు సిబ్బంది సమస్యాత్మక కేంద్రాల వద్ద అదనపు సిబ్బందితో పాటు ఒక ఏఎస్సైతో పాటు ప్రత్యేక పోలింగ్ బృందాలను, వీటితో పాటు మొబైల్ పోలీసు బృందాలను నియమించారు.

# తీర ప్రాంత రక్షణకు శాశ్వత చర్యలు



కోనపాపపేటలో మత్స్యకారుల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే అభ్యర్థి గీత


- ఎమ్మెల్యే అభ్యర్థి గీత
- కోనపాపపేట, రామన్నపాలెంలో ఎన్నికల ప్రచారం



కోనపాపపేటలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత

కొత్తపల్లి: తీర ప్రాంత రక్షణకు శాశ్వత పరిష్కారం చేపడతామని, మత్స్యకారులను అన్ని విధాలా ఆదుకున్న ప్రభుత్వం వైఎస్సార్ సీపీ అని ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత అన్నారు. మండలంలోని పొన్నాడ శివారు కోనపాపపేట, రామన్నపాలెంలో శనివారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. తమ రెండు ఓట్లను ఫ్యాన్ గుర్తుపై వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా చలమలశెట్టి సునీల్‌ను అఖండ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యంగా తీర ప్రాంత గ్రామాలైన ఉప్పాడ, కోనపాపేట ప్రాంతాల్లో వందలాది గృహాలు కోతకు గురవుతున్నాయన్నారు. పూర్తి స్థాయిలో శాశ్వత పరిష్కారం చేపడతామని హామీ ఇచ్చారు. కాలుష్య రహిత పరిశ్రమల నిర్మాణంపై దృష్టి పెడతామన్నారు. మత్స్యకార సమస్యలన్నింటినీ పరిష్కరించే విధంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక కృషి చేస్తున్నారన్నారు. ఎంపీపీ కారే సుధ, కోఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు, కోనపాపపేట గ్రామ కమిటీ అధ్యక్షుడు ఉమ్మిడి చిన్న, మండల పార్టీ అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, ఎస్సీ,ఎస్టీ డివిజన్ మోనటరింగ్ కమిటీ సభ్యుడు బండి దావీదు, మండల వ్యవసాయ అడ్వయిజర్ కమిటీ చైర్మన్ జ్యోతుల బాబు ఉన్నారు.

## శృంగారవల్లభుని ఆదాయం రూ.3.4 లక్షలు



భక్తుల నుంచి పూజలందుకుంటున్న తిరుపతి శృంగారవల్లభ స్వామి

పెద్దాపురం: మండలంలోని తొలి తిరుపతి స్వయంభూ శృంగార వల్లభుని ఆలయానికి శనివారం భక్తులు బారులు తీరారు. ఆలయ చైర్మన్ కర్రి వెంకట జగదీశ్వరరావు, ఈఓ వడ్డి శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందుల తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయ టిక్కెట్లు, అన్నదానం, కేశ ఖండన ద్వారా స్వామి వారికి 3,40,408 రూపాయలు ఆదాయం సమకూరినట్లు ఈఓ శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా సుమారు పదిహేను వేల మంది భక్తులు స్వామి వారిని దర్శించుకోగా భక్తులకు ప్రసాద వితరణ, అన్నదానంతో పాటు ఎండ తీవ్రత నేపథ్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ఈఓ తెలిపారు. ఎంపీటీసీ కుంచే బుచ్చిరాజు, ఆలయ కమిటీ సభ్యులు కుంచే వెంకన్న, జగ్గారావు, కుమారి, ఆలయ అర్చకులు పెద్దింటి నారాయణాచార్యులు, పెద్దింటి పురుషోత్తమాచార్యులు, సిబ్బంది అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



స్వామివారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

# స్థానిక అభ్యర్థిగా అవకాశం ఇవ్వండి

- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దవులూరి
- వేట్లపాలెంలో విస్తృతంగా ప్రచారం



సామర్లకోట మండలం వేట్లపాలెంలో ప్రచారం చేస్తున్న దొరబాబు

సామర్లకోట: పెద్దాపురం నియోజకవర్గానికి చెందిన అభ్యర్థిగా సామర్లకోట వాసిగా మీ కుటుంబ సభ్యునిగా మీ ముందుకు వచ్చి అడుగుతున్నా ఒకసారి ఎమ్మెల్యేగా అవకాశం ఇవ్వండని వైఎస్సార్‌సీపీ అభ్యర్థి దవులూరి దొరబాబు వేట్లపాలెంలో ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ నిడదవోలు సురేష్‌చౌదరి, పార్టీ నాయకులు గోలి బాబ్జీ, నిడదవోలు రాంబాబు, వల్లూరి వీర్రాజుచౌదరి, దొరబాబు సతీమణి చంద్రకళలతో కలిసి ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయా ముఖ్య కూడళ్లలో ప్రచార వాహనంపై ప్రసంగించారు. సుమారు 40 సంవత్సరాల తరువాత స్థానిక అభ్యర్థిగా మీ ముందుకు వస్తున్నానని ప్రతి ఒక్కరూ ఆశీర్వదించాలన్నారు. గత 20 ఏళ్లుగా ఎమ్మెల్యేగా పోటీ చేయడానికి ప్రయత్నం చేయగా జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో వైఎస్సార్ సీపీ నుంచి పోటీ చేసే అవకాశం వచ్చిందన్నారు. వైఎస్సార్ సీపీ కాకినాడ పార్లమెంటు అభ్యర్థి చలమలశెట్టి సునీల్ పోటీ చేస్తున్నారని, రెండు ఓట్లు ఫ్యాను గుర్తుపై వేయాలన్నారు. నియోజకవర్గంలో అందరికీ అందుబాటులో ఉండి ప్రజల సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం సంపాదించుకొవడానికే తాను, సునీల్ రాజకీయాలలోనికి వచ్చామన్నారు. వేట్లపాలెం గ్రామానికి చెందిన కొండపల్లి కృష్ణమూర్తి, సామర్లకోటకు చెందిన వుండవిల్లి నారాయణమూర్తి ప్రజలకు అందుబాటులో ఉండి మంచి గుర్తింపు పొందారని వారి బాటలోనే తాను నడుస్తానని చెప్పారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాల ప్రజలకు మేలు చేసేలే పాలన చేస్తున్నారని, అయితే చంద్రబాబునాయుడు ఎన్నికల కోసం తప్పుడు ప్రచారం చేస్తున్నారని తెలిపారు. చంద్రబాబునాయుడు మేనిఫెస్టోను బీజేపీ నాయకులు కూడా నమ్మడం లేదని ఓటర్లు తెలుసుకోవాలన్నారు. ఓటు వేసే ముందు తమ తమ కుటుంబాలకు ఎవరి వల్ల మేలు జరిగిందో ఆలోచించి ఓటు వేయాలన్నారు. ఒకసారి పొరపాటు చేస్తే ఐదేళ్ల పాటు నష్ట పోతామని హెచ్చరించారు. స్థానిక బలం నిరూపించేలా మెజార్టీ ఉండాలన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు తాటికొండ అచ్చిరాజు, అయ్యరక కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఆవాల రాజేశ్వరి, పార్టీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి మడికి సోనియా, కౌన్సిలర్లు, గ్రామ ఎంపీటీసీ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కాగా ఆయా వార్డులలో కౌన్సిలర్లు, గ్రామాల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు దొరబాబు, సునీల్‌కు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు.